ముమ్మరంగా 'ఒక మార్పు అభివృద్ధికి మలుపు'



నిజాంపేట్: ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్వయం సహాయ సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పలు సామూహిక పర్యావరణ కార్యక్రమాలు చేపట్టారు. చెరువులను శుభ్రపరచడం , తడి, పొడి చెత్తను వేరుచేయడం, వరదలు, మురుగు నిల్వలు నివారించడం వంటి పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విశ్వవిద్యాలయంలో నేడు యోగా డే

నిజాంపేట్: బాచుపల్లి సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కమిటీ హాల్, పరిపాలనా భవనంలో శనివారం ఉదయం 10.30 గంటలకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు హాజరుకానున్నారు. విద్యార్థులచే యోగాసనాలు ఉంటాయని పేర్కొన్నారు.

గుంతలు పూడ్చి.. కబ్జా చేసి!



కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజుల రామారం సర్వే నెంబర్ 307 లో అర్ధరాత్రి హిటాచీలతో ప్రభుత్వ స్థలం గుంతలను పూడ్చి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై రౌడీషీట్లు తెరిచిన డోంట్ కేర్ అంటూ.. ఒకవైపు రెవెన్యూ.. మరోవైపు హైడ్రా... ఇంకోవైపు పోలీసులకు చుక్కలు చూపిస్తున్నారు. అంతేకాకుండా కొంతమంది అధికారులు వీరికి సహకరిస్తుండటంతో అమాయకులకు వీటిని కట్టబెట్టి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు కబ్జాదారులపై కఠినంగా వ్యవహరిస్తే ప్రభుత్వ స్థలాలు కాపాడగలుగుతారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ ఒక్షిత హిల్ వ్యూ కాలనీలో రూ. 60 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శివారు ప్రాంతాల్లో వెలుస్తున్న కొత్త కాలనీల్లో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, ఒక్షిత హిల్ వ్యూ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ గౌడ్, ఉపాధ్యక్షుడు నాగరాజు, అడ్వైజర్ సురేంద్ర, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కైసర్ నగర్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులు, భూగర్భ డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే వివేకానంద్ అధికారులతో కలిసి పరిశీలించారు. పదేళ్లుగా కైసర్ నగర్‌లో కోట్లాది నిధులు కేటాయించి అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ మల్లారెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం మాధవి, ఈఈ కిష్టప్ప పాల్గొన్నారు.



ఒక్షిత్ హిల్ వ్యూ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

బీఆర్‌ఎస్ పాలనలో చెరువులు అన్యాక్రాంతం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ పాలనలో చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. సూరారంలోని పలు కాలనీల్లో బోరు బావులు ఎండి తీవ్ర నీటి కొరత ఏర్పడిందని కాలనీ వాసులు ఆయనను కలిసి విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన స్థానికంగా ఉన్న నీటి కుంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 21లో ఉన్న కొత్త కుంట చెరువును కొందరు బీఆర్‌ఎస్ నాయకులు మట్టి పూడ్చి గదులు నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పలు చెరువులను స్థానిక ప్రజా ప్రతినిధి అనుచరులు కబ్జాలు చేసి ఆక్రమలకు పాల్పడ్డారని, వారిని వదిలే ప్రసక్తి లేదన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక చెరువులు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, సీనియర్ నాయకులు సంజీవ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సంతోష్, సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, శ్రీరామ్ నగర్, కృష్ణ నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న హన్మంత్‌రెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల క్యాపిటల్ వర్క్స్ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ శుక్రవాంర ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు గాయత్రినగర్, గోదావరి హోమ్స్, బీమ్స్ అండ్ కాలమ్స్ అపార్ట్‌మెంట్, 11కేవీ సత్యం ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు దండమూడి ఎన్‌క్లేవ్, సురక్ష ఆసుపత్రి, వీవీఎస్ నందదీప్ అపార్ట్‌మెంట్, ఆర్టీఓ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, 11 కేవీ బాలాజీ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెనోవా ఆసుపత్రి, హైటెన్షన్ రోడ్డు, కాస్ హోటర్, శ్రీని ఎవెన్యూ గేట్ 1, 2, 3 అంగడిపేట్, 11 కేవీ సెయింట్ ఆన్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు సెయింట్ ఆన్స్ స్కూల్, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్, ఎన్‌సీఎల్ సౌత్, 11 కేవీ పైపులైన్ రోడ్డు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు పైపులైన్ రోడ్డు, జీడిమెట్ల ఎస్సీ కాలనీ, సీఎంఆర్ స్కూల్ లేన్, శ్వేత ఆర్యన్, నిర్మాన్ అపార్ట్‌మెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

నిజాంపేట్: మయూరి నగర్ సబ్‌స్టేషన్ 11కేవీ మయూరి నగర్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు అర్క్ టవర్స్, మయూరి నగర్ భాగం, ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్డు, వృద్ధాశ్రమం, 11కేవీ ప్రశాంత్‌నగర్ ఫీడర్‌లో ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు వృద్ధాశ్రమం, వెంకట్ రాయ్ నగర్, బాలాజీ ఎన్‌క్లేవ్, సిరి ఎన్‌క్లేవ్, ఇందిరమ్మ ఫేజ్ 1, 2, ఆర్‌ఎల్ సిటీ రోడ్డు, మియాపూర్ ఎక్స్ రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ న్యూ కాలనీ ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి 10.30గంటల వరకు న్యూ కాలనీ, లక్ష్మీ నగర్, నరేన్ గార్డెన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సుభాష్‌నగర్: 11కేవీ గాజులరామారం పరిధిలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు బాలాజీ లేఅవుట్, తత్వా స్కూల్, గాజులరామారం మహారాజా గార్డెన్స్ లేన్, 11 కేవీ మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఓక్షిత ఎన్‌క్లేవ్, వీనస్ ఎన్‌క్లేవ్, శ్రీవృద్ధి ఎన్‌క్లేవ్, 11 కేవీ కైలాస్ హిల్స్ ఫీడర్ పరిధిలో షిర్డీ హిల్స్, కైలాస్ హిల్స్, నందిని హిల్స్, తిరుమల హిల్స్, ప్రాగా టూల్స్ కాలనీల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

చింతల్: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ తిరుమలగిరి సబ్‌స్టేషన్ సత్యసాయి ఎంక్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీచర్స్ కాలనీ, ఇంద్రానగర్, ఎల్‌బీ కాలనీ, సత్యసాయి ఎంక్లేవ్, పెన్షన్ లైన్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆర్య సమాజ్, కంసరి బజార్, మేస్త్రిటి, పెద్దతోకట్ట, పెన్షన్ లైన్, బోయిన్పల్లి మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

నేటి నుంచి రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వైష్ణవి ఎంక్లేవ్ రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం శని, ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. శనివారం పూజా కార్యక్రమాలు చేపట్టి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కల్యాణం ఉంటుంది. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సాయంత్రం ఊరేగింపులో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నెలాఖరులోగా ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలి

తహసీల్దార్లకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మంజూరైన 1,409 ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు ఇంటింటికి తిరిగి తాజా పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పురోగతిపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాకు మంజూరైన ఇళ్లను 10 రోజుల్లో వంద శాతం గ్రౌండింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు 1409 ఇళ్లు మంజూరు కాగా, 516 ఇళ్లు ఇప్పటి వరకు పూర్తయ్యాయని, ఇంకా 900 ఇళ్లు గ్రౌండింగ్ కావాల్సి ఉందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణమూర్తి తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గ్రౌండింగ్ కాని 900 ఇళ్లపై 8 మంది ఏఈలు ఒక్కొక్కరూ 125 ఇళ్ల చొప్పున బాధ్యత తీసుకుని వచ్చే వారంలోగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక కోటాకు సంబంధించిన వెయ్యి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా ఎల్ - 2 జాబితాలో ఉన్న వారికి కేటాయించాలని ఆదేశించారు. డబ్బులు లేక ఇందిరమ్మ ఇళ్ల బేస్‌మెంట్ నిర్మాణం చేయలేక పోతున్న వారికి మహిళా సంఘాల్లో చేర్పించి, రూ.లక్ష రుణ ం మంజూరు చేయించడం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్త, జిల్లా హౌసింగ్ పీడీ రమణమూర్తి, డీఈలు ,ఏఈలు పాల్గొన్నారు.

సాధన పాఠశాలలో యోగా దినోత్సవం



సుభాష్‌నగర్: సూరారం డివిజన్ నెహ్రూనగర్‌లోని సాధన హైస్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపకుడు జగన్ గురూజీ మార్గదర్శకత్వంలో యోగా సాధన చేశారు.